సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

జీవనం.. దుర్భరం



డ్రైనేజీలు లేని ఎస్సీ, బీసీ కాలనీ



రోడ్డు, డ్రైనేజీలు, మెట్లు లేని కాలనీలో వీధులు



తుప్పలు, రాళ్లతో కాలనీ ముఖద్వారం



రాళ్లదారిలో జారిపడి మంచాన పడ్డ అత్తాకోడళ్లు కనకమ్మ, సరస్వతి

- రోడ్డు, మెట్లు లేని కొండవాలు
- డ్రైనేజీల్లేక వీధుల్లోనే మురుగు
- తాగునీటికి అవస్థలు
- దశాబ్దాలుగా ఇదే దుస్థితి

ఎస్సీ, బీసీ కాలనీలో కానరాని అభివృద్ధి

రాళ్లు తేలిన కొండవాలు .. రోడ్లు, డ్రైనేజీలు, మెట్లు వంటివేమీ మచ్చుకైనా కానరాని **ప్రాంతం.. అక్కడి ప్రజలు ఇళ్ల** నుంచి కిందకు, కింద నుంచి పైకి చేరుకోవాలంటే నిత్యం అవస్థలే. ఈ క్రమంలో జారిపడి గాయాలపాలైన వారెందరో.. ఎప్పుడైనా తాగునీరు రాకుంటే, కింద నుంచి పైకి తీసుకువెళ్లాలంటే మహిళలకు నరకం.. వాడుక నీరేమో వీధుల్లోనే పారే దుస్థితి.. ఇదేదో మారుమూల కుగ్రామం అనుకుంటే పొరబడినట్లే.. సిటీ ఆఫ్ డెస్టినీగా పేరుగాంచిన విశాఖ శివారులోని ఆనందపురం పంచాయతీకి చెందిన ఎస్సీబీసీ కాలనీ పరిస్థితి **ఇది..** ఆరు దశాబ్దాలుగా వారు గడుపుతున్న దుర్భర జీవనానికి నిదర్శనమిది..

తగరపువలస: ఆనందపురం పంచాయతీకి చెందిన ఎస్సీబీసీ కాలనీలో ఆరు దశాబ్దాలుగా అభివృద్ధి ముఖం చాటేసింది. ఇక్కడ సుమారు 175 నుంచి 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. పూర్తిగా వెనుకబడిన ప్రాంతమైన ఈ కాలనీలో ఎక్కువ మంది పెయింటర్లు, గ్యాస్ స్టౌ రిపేర్లు చేసేవారు, ఆటో కార్మికులు, తలకు ప్లాస్టిక్ సామాన్లు విక్రయించుకునేవారే ఉన్నారు. కాలనీ మొత్తం డ్రైనేజీలు, రోడ్లు, మెట్లు లేని కొండవాలు ప్రాంతంలో రాళ్లు తేలి ఉంది. దీంతో ఈ ప్రమాదకరమైన మార్గంలో జీవనయానం సాగించే వారు ఇళ్ల నుంచి కిందకు తిరిగి పైకి చేరుకోవడానికి నిత్యం అష్టకష్టాలు పడుతుంటారు. తాగునీరు సరఫరా కాని రోజుల్లో ఇక్కడి మహిళలు నీటి కోసం నానాయాతన పడుతుంటారు. **సరైన మార్గం లేకపోవడం ఒక కారణమైతే** వాడుక నీరు ఎక్కడపడితే అక్కడే నిలిచిపోయి ఇళ్ల మధ్య రాళ్లు నాచుకట్టి గబ్బు కంపు కొడుతున్నాయి. దీంతో తరచూ ఇక్కడి వారు వ్యాధుల బారిన పడుతుంటారు. కాలనీ నుంచి బయటకు వెళ్లాలన్నా రాళ్లు, తుప్పలతో కూడిన మార్గాలు, దారి కాచిన విషపురుగులు ఇక్కడ సాధారణం. ఆరేడు వీధులున్నా ఒక్కచోటా రోడ్లు, డ్రైనేజీలు లేవని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలల క్రితం ఈ మార్గంలో నడుస్తూ కూలబడిన అత్త కడమంచి కనకమ్మ, మోకాలు విరిగి కోడలు సరస్వతి మంచానికే పరిమితం అయ్యారు. ఇటీవల అయితి ముత్యాలమ్మ అనే వృద్ధురాలు జారిపడి, మక్క విరగడంతో శస్త్రచికిత్స చేయించారు.

కాలనీకి చేరుకునే మార్గమే సాహసం



రాళ్ల మార్గంలో పడి మక్క విరిగిన ముత్యాలమ్మ

ఎస్సీబీసీ కాలనీకి బయట ప్రాంతాల నుంచి చేరుకోవడమే పెద్ద సాహసం. పూర్తిగా కొండవాలు ప్రాంతంలో ఉన్న ఇక్కడ వీధిలైట్లు తప్ప మిగతా సౌకర్యాలు లేవు. వేములవలస మార్కెట్‌ను ఆనుకుని కొండవాలు మార్గం ద్వారా కేవలం నడిచి వెళ్లేవారికే అవకాశం ఉంటుంది. జెడ్పీ హైస్కూల్ మార్గంలో వెళ్లే వారికి నిటారుగా ఉండే వాలు ప్రాంతం ఒక పెద్ద పరీక్షలా ఉంటుంది. కొండపై నుంచి ప్రవహించే వర్షం నీరు పోవడానికి గతంలో ఉన్న గెడ్డ ఆక్రమణలకు గురైంది. ప్రతి ఇల్లు కోతకు గురవకుండా గుడ్డిలో మెల్ల అన్నట్టుగా రాళ్లనేర్పుతో తాత్కాలికంగా సొంతంగా రక్షణగోడలు నిర్మించుకోవడం ఇక్కడ కనిపిస్తుంది. ఇవే వీరిపాలిట ప్రమాదాలుగా పరిణమిస్తున్నాయి. ఇక్కడి వారిలో విద్యాభ్యాసం కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో చిన్నారులు కూలిపనులకు వెళ్తుంటారు. కొండపై చిన్న సింటెక్స్ వాటర్ ట్యాంకే వారి తాగునీటికి ఆధారం. ఇటీవల కొండ దిగువ వేములవలస–బోని మార్గంలో పైపులైన్ తవ్వేయడంతో తాగునీటికి కూడా కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు.

అడవి కన్నా దారుణం



మా కాలనీ వాసులు అంతా పేదవారే. కనీసం అడవులలో అయినా కొన్ని వసతులు ఉంటాయి. మేము వాటికి కూడా నోచుకోలేకపోతున్నాం. మా పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు అందుబాటులో అంగన్‌వాడీ కేంద్రం లేదు. బడి కోసం కొంత నయం.

– మోతి కొండమ్మ

మెట్ల మార్గం నిర్మించాలి



కాలనీలో సరైన వసతులు లేని కారణంగా ఇంటి నుంచి బయటకు వెళ్లాలన్నా పెద్ద సాహసం చేయాలి. చాలామంది బయటే వంట చేసుకుంటారు. వాలు మార్గంలో నడిచేటప్పుడు జారి పడి ఎముకలు విరగ్గొట్టుకుంటున్నారు. మెట్ల మార్గం ఏర్పాటు చేస్తే మంచిది.

– అయితి నందిని

మా కష్టాలు తీర్చాలి



నా చిన్ననాటి నుంచి రోడ్లు, డ్రైనేజీల కోసం ఎదురు చూస్తున్నాం. పైన ఇళ్లలో వాడిన నీరు దిగువ ఇళ్లలోకి ప్రవేశిస్తుంది. ఇక వర్షాకాలం అయితే మా కష్టాలు చెప్పలేం. ఎవరో ఒకరు జోక్యం చేసుకుని మమ్మల్ని కష్టాల నుంచి గట్టెక్కించాలి.

– కడమంచి అప్పారావు

క్లుప్తంగా

నేటి నుంచి గాయత్రీదేవి ఆలయ వార్షికోత్సవాలు



పద్మనాభం: మండలంలోని బుడ్డివలస–అగ్రహారం పంచాయతీ లింగన్నపేటలో వేదమాత గాయత్రీ దేవి ఆలయ 12 వార్షికోత్సవాన్ని ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఎనిమిదో తేదీన గాయత్రి, లలిత, దుర్గాదేవి విగ్రహాల ఊరేగింపు ఉంటుందన్నారు. కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాల నడుమ విగ్రహాలను గ్రామంలో ఊరేగిస్తామని తెలిపారు. తొమ్మిదో తేదీన దత్తాత్రేయుడు, అనఘా దేవిల కల్యాణ మహోత్సవం జరిపించనున్నట్లు పేర్కొన్నారు. పదో తేదీన గాయత్రి, లలిత, దుర్గాదేవి విగ్రహాలకు పంచామృత అభిషేకాలు, లలితా పారాయణం నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

న్యూటన్ విగ్రహావిష్కరణ



న్యూటన్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్‌బీఐ రిటైర్డ్ మేనేజర్ కృపాకర్ తదితరులు

భీమునిపట్నం: భీమిలిలోని సీబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిన పోతుల న్యూటన్ సేవలు ఎంతో అమూల్యమైనవని స్టేట్ బ్యాంక్ విశ్రాంత మేనేజర్ పి.కృపాకర్, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పి.జి.కె.వర్మ అన్నారు. ప్రధానోపాధ్యాయుడిగా, కరస్పాండెంట్‌గా సుదీర్ఘకాలం సేవలు అందించిన పోతుల న్యూటన్ విగ్రహావిష్కరణలో వారు మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి, ఉత్తీర్ణత శాతం పెంపునకు ఆయన అందించిన సేవలు మరువలేమన్నారు. కార్యక్రమంలో న్యూటన్ కుటుంబ సభ్యులు సుందర్ సింగ్, సూర్యకుమారి, పి.ఎస్.చంద్, పి.విజయకుమారి, ఇక్కడ పని చేసిన విశ్రాంత ఉపాధ్యాయులు, ఎం.వి.ఎల్.కామేశ్వరరావు, మైలపల్లి షణ్ముఖరావు పాల్గొన్నారు.


సామాజిక మాధ్యమాలతో సంగీతం మరింత చేరువ



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కర్ణాటక సంగీత విద్వాంసులు గాయత్రి, రంజని

కొమ్మాది: సామాజిక మాధ్యమాల ప్రభావంతో శాస్త్రీయ సంగీతం పరిధి విస్తరించి, సంగీతం నేర్చుకోవాలనుకునే ప్రతి ఒక్కరినీ చేరుతోందని కర్ణాటక సంగీత విద్వాంసులు రంజని, గాయత్రి అన్నారు. చేంజ్ మేకర్స్ పేరిట గీతంలో శుక్రవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా కళాకారులు ఎక్కువ శాతం మంది సంగీతానికి చేరువవుతున్నారన్నారు. సంగీతం శిక్షణ సహిత కొత్త మార్పులకు దారి తీస్తోందన్నారు. చిన్న వయస్సులోనే సంగీత సాధన ప్రారంభించినప్పటికి సంగీతంలో కొత్త అంశాలు నేర్చుకోవడానికి నేటికీ నిత్య విద్యార్థులుగా ఉంటున్నామని తెలిపారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్ కుమార్

పద్మనాభం: పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని మద్ది జెడ్పీ హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను విధిగా నిర్వహించాలన్నారు. ఏ ఒక్క విద్యార్థీ గైర్హాజరు కాకూడదన్నారు. సీ, డీ గ్రేడ్‌లలో ఉన్న విద్యార్థులను ఏ లేదా బీ గ్రేడుల్లోకి తీసుకు వచ్చేందుకు ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ నెల పదో తేదీన నిర్వహించనున్న డీవర్మింగ్ డే గురించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పరీక్షించారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా జరిగాయి. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేష వస్త్రాన్ని, అభిషేక సామాగ్రిని ప్రదక్షణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకువెళ్లారు. స్వామికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



బాలికలకు కిట్లు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

తగరపువలస: నాంది ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం చిట్టివలస జెడ్పీ హైస్కూల్, ఆంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్‌లో 334 మంది విద్యార్థినులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని రోజామణి, ఫౌండేషన్ ప్రతినిధులు భార్గవి, సంధ్య, దేవి, సత్యవతి పాల్గొన్నారు.

ఆటో ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడికి గాయాలు



గాయపడ్డ వృద్ధుడు

పీఎం పాలెం: ఆటో ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు తీవ్ర గాయాలపాలయ్యారు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. జాతీయ రహదారిపై మహిళా పోలీస్ స్టేషన్ ఎదురుగా శుక్రవారం రోడ్డు దాటుతున్న వృద్ధుడి(70)ని ఆటో బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన వృద్ధుడు అపస్మారక స్థితిలో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఎరుపు రంగు షార్ట్, తెలుపు బనియన్ కలిగిన వృద్ధుని వివరాలు తెలిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సీఐ తెలిపారు.

నిత్యం అండగా ఉంటా..

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చిన్న శ్రీను



పిల్లా సత్యనారాయణ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న చిన్న శ్రీను

మధురవాడ: భీమిలి నియోజకవర్గంలోని ప్రజలకు, పార్టీ కార్యకర్తలు, నాయకులకు అనునిత్యం అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) చెప్పారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పిల్లా సత్యనారాయణ మాతృమూర్తి అప్పలనరసమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, మారికవలసలోని నివాసానికి వెళ్లి ఆయన్ను, ఏపీ నగరాలు కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ పిల్లా సుజాతను శ్రీను పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా ఏ సమయంలోనైనా తనను సంప్రదించవచ్చునన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసి, పూర్వ వైభవానికి అంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా కార్యదర్శి వంకాయల మారుతీప్రసాద్, ఆనందపురం జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, ఆనందపురం మండల ప్రెసిడెంట్ బక్క సత్యం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వాండ్రాసి రవికుమార్, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యురాలు ముదుండి రాజేశ్వరి, రాష్ట్ర యువజన విభాగం కార్యవర్గ సభ్యుడు జగ్గుపిల్లి నరేష్, పెంట్ర అప్పన్న, బైపిల్లి ప్రసాద్, వీవీ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు చిన్న శ్రీను ఆనందపురం మండలం గండిగుండం ముత్యాలమ్మను దర్శించుకుని పూజలు చేశారు.

మహిళా నాయకుల మర్యాదపూర్వక కలయిక

చిన్న శ్రీనునిను మధురవాడకు చెందిన పలువురు మహిళా నాయకులు విజయనగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం కలిశారు. ఆయనకు దుశ్శాలువాలు కప్పి సత్కరించారు.



జీవీఎంసీ ఒకటో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, అరుణ దంపతుల కుమార్తె దివ్య కీర్తి, సందీప్‌ల వివాహం తగరపువలసలో శుక్రవారం జరిగింది. ఆ వేడుకకు ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త చిన్న శ్రీను తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

– తగరపువలస

భర్తను అనువర్తించడమే స్త్రీ పరమ ధర్మం

- సీతాదేవికి అనసూయ ఉద్బోధ
- 14వ రోజు రామాయణ ప్రవచనంలో చాగంటి కోటేశ్వరరావు



ప్రవచనం వినిపిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: భర్తను అనువర్తించడమే స్త్రీ పరమ ధర్మమని అత్రి మహర్షి భార్య అయిన అనసూయ తమ ఆశ్రమానికి వచ్చిన సీతాదేవికి స్త్రీ ధర్మముల గురించి ఉద్బోధ చేశారని ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. ధర్మమెప్పుడూ తనవైపు నుంచి ఉంటుంది కాబట్టి భర్త గుణములు ఎంచడం కన్నా అతనిని అనువర్తించడమే ప్రధానమని తెలిపారన్నారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సంపూర్ణ రామాయణంపై శుక్రవారం 14వ రోజు ఆయన ప్రవచించారు. తన భర్త అయిన శ్రీరాముడు సకల సద్గుణ సంపన్నుడని, అంతటి ధర్మాత్ముడిని అనువర్తించడం తన పరమ ధర్మమని సీతాదేవి ఎంతో సంతోషంగా అనసూయకు చెప్పినట్టు తెలిపారు. తమ పాతివ్రత్యం, నడవడి, తపశ్శక్తి చేత దేవతా కార్యములను సైతం సాధించి అనావృష్టిని కూడా నివారించిన మహోన్నతమైన స్త్రీ మూర్తులు ఈ దేశంలోనే ఎందరో ఉన్నారని శ్రీరామాయణం తెలియజేస్తుందని చాగంటి వివరించారు. అత్రి మహర్షి మార్గ నిర్దేశం మేరకు సీతారామ లక్ష్మణులు దండకారణ్యము వైపు బయల్దేరడంతో అయోధ్యకాండ ప్రవచనం పూర్తి చేశారు. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు బ్రహ్మశ్రీ విశ్వనాథ గోపాలకృష్ణ, బ్రహ్మశ్రీ పాండురంగ మిట్టల్, బ్రహ్మశ్రీ చాగంటి రాజా బాలసుబ్రమణ్యం దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో పలువురు నిర్వాహకులు పాల్గొన్నారు.

కారును ఢీ కొట్టిన ఆయిల్ ట్యాంకర్



దెబ్బ తిన్న కారుపై తహసీల్దారు బోర్డు

మధురవాడ: జాతీయ రహదారిపై మధురవాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కారు దెబ్బతింది. కొమ్మాది జంక్షన్ నుంచి కార్‌షెడ్ వైపు వెళ్తున్న కారును శుక్రవారం సాయంత్రం 5గంటల సమయంలో వెనుక నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఢీ కొట్టింది. దీంతో కారుకు ఒక వైపు ఉన్న డోరు భాగం బాగా దెబ్బతింది. అయితే ఈ కారుకు తహసీల్దారు బోర్డు ఉంది. అది విజయనగరం జిల్లాకు చెందిన ఓ తహసీల్దారు కారు అని చెబుతున్నారు. పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేసి లా అండ్ ఆర్డర్ పోలీసులకు ట్యాంకర్‌ను అప్పగించారు. ఎటువంటి ఫిర్యాదు రాకపోవడంతో కారును విడిచి పెట్టినట్టు పోలీసులు తెలిపారు. కారు దెబ్బతిన్నా పోలీసులకు ఫిర్యాదు ఇవ్వకపోవడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన పీవో

సాక్షి ఎఫెక్ట్..



గొట్టిపల్లి కళ్లాలు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ పీవో శ్రీదేవి

తగరపువలస: ఆనందపురం మండలం గొట్టిపల్లి కళ్లాలు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ భీమిలి ప్రాజెక్ట్ అధికారి ఎం.శ్రీదేవి శుక్రవారం సందర్శించారు. ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ నీరు నిల్వ ఉండటంతో పాటు టాయిలెట్లలోకి నీరు ప్రవేశించి ఉంది. దీంతో ‘ మూడు నెలలుగా ముంపులోనే’ శీర్షికతో గురువారం సాక్షిలో వార్త ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన పీవో గొట్టిపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోని వాటర్ వర్క్స్ పైపులైన్ తరచూ లీకేజీ కారణంగా అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ నీరు చేరుతోందన్నారు. పంచాయతీ సెక్రటరీ సాయంతో పైపులైన్ లీకేజీలు అరికట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీ కేంద్రం టాయిలెట్ల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ ప్రైవేట్ వ్యక్తులకు చెందిన ఎలాంటి పరికరాలు లేకుండా చూస్తామని, అవసరమైతే వారికి నోటీసులు జారీ చేస్తామని పీవో హెచ్చరించారు.

మహిళ నుంచి రూ.20వేల అపహరణ

- ఆటోలో మైకంతో స్పృహ తప్పిన వైనం
- ఇంటికి వచ్చి చూడగా సొమ్ము మాయం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు వలందపేటకు చెందిన నగిరెడ్ల గురునాధ అనే కూరగాయలు విక్రయించే మహిళ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.20వేలు అపహరించిన సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. బాధితురాలు ఆనందపురంలో కూరగాయలు కొని నగరంలోని శివాజీపాలెంలో విక్రయిస్తుంటుంది. గురువారం కూరగాయలు విక్రయించిన తరువాత అక్కడ మరికొందరు ఇచ్చిన రూ.20వేల పప్పుల చీటీల సొమ్ము చిక్కంలో పెట్టుకుని ఆటోలో బయల్దేరింది. అప్పటికే ఆటోలో మరో మహిళ కూడా ఉంది. ఆటో ఎక్కిన తరువాత గురునాధ మైకం వచ్చి, స్పృహ కోల్పోయింది. ఆనందపురం వచ్చిన తరువాత ఆటోలో మరో మహిళ నిద్రలేపి గురునాధను దిగమని చెప్పగా, తాను వలందపేటలో దిగుతానని చెప్పింది. కాసేపటికి ఆటో వలందపేట జాతీయరహదారి వద్దకు చేరుకోవడంతో ఇంటికి వెళ్లి డబ్బులు కోసం చిక్కం వెతకగా చిక్కం దోపుకున్న ప్రాంతంలో చీర చిరిగిపోవడంతో పాటు చిక్కం కనిపించలేదు. దీంతో పప్పుల చీటీల సొమ్ముతో పాటు కూరగాయలు విక్రయించిన సొమ్ము కూడా అపహరణకు గురైనట్టు గుర్తించిన బాధితురాలు శుక్రవారం సాయంత్రం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పోలీస్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు



విధినిర్వహణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కమాండెంట్, అడిషనల్ కమాండెంట్

పీఎం పాలెం: విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని 16వ ఏపీఎస్‌పీ బక్కన్నపాలెం పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ సూచించారు. బెటాలియన్ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన పోలీస్ దర్బారులో ఆయన ప్రసంగించారు. ఉత్తమ సేవలు కనబరచిన సిబ్బందికి, అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మావోయిస్ట్ ప్రభావిత ఏజెన్సీ ప్రాంతాల్లో విధులు నిర్వహించినప్పుడు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అననుకూల పరిస్థితులలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. బెటాలియన్ సిబ్బంది వ్యక్తపరచిన పలు సందేహాలను నివృత్తి చేశారు. అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలను నూరుశాతం పాటించాలని సూచించారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ సీహెచ్ వీస్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు పి.సత్యం, జి.ఇలియా సాగర్, వి.నారాయణ, ఎస్.మురళీధర్, బి.రామకృష్ణ, స్థానిక హాస్పిటల్ స్టాఫ్, ఆర్ఐలు పాల్గొన్నారు.

తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్‌కే మళ్లీ బాధ్యతలా..!

తగరపువలస: ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీలో గతంలో తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్‌కే కూటమి ప్రభుత్వం మళ్లీ బాధ్యతలు అప్పగించడంపై స్థానికులలో నిరసన వ్యక్తం అవుతోంది. బినామీ మస్టర్లు వేసి, చనిపోయిన వారి పేర్ల మీద ఉపాధి హామీ పనుల డబ్బులు కాజేయడంతో పాటు గత పంచాయతీ ఎన్నికలలో ప్రచారంలో పాల్గొన్నందుకు గత ప్రభుత్వం అతడిని తొలగించిందన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ ప్రోత్సహించడంతో తొలగింపబడిన ఫీల్డ్ అసిస్టెంట్ మూడు రోజులుగా మామిడిలోవ ఉపాధిపనుల్లో జోక్యం చేసుకుంటున్నాడన్నారు. వాస్తవానికి పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్ట్ ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించారన్నారు. ఆ కేటగిరీ అభ్యర్థులు లేనప్పుడు టెక్నికల్ అసిస్టెంటే ఆ బాధ్యతలు తీసుకోవాలి. తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్‌కు మళ్లీ బాధ్యత అప్పగిస్తే ఆందోళన చేస్తామని పంచాయతీ వాసులు హెచ్చరిస్తున్నారు.

